# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


3



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

సోమవారం 6 మే 2024


# సర్పంచులకూ మోసమే

- ఉత్సవ విగ్రహాలుగా మారిన వైనం
- నిధుల్లేక పల్లెల్లో నీరుగారిన అభివృద్ధి
- వచ్చినవి పక్కదారి పట్టించిన సర్కారు
- కాలువలూ శుభ్రం చేయలేని దుస్థితి
- నిర్వీర్యమైన గ్రామపంచాయతీలు
- సచివాలయాలకే ప్రాధాన్యం
- వైసీపీ ప్రభుత్వ తీరుపై విమర్శలు
- ఈ ఎన్నికల్లో తమ సత్తా ఏంటో చూపుతామంటున్న 'స్థానిక' ప్రతినిధులు

(రణస్థలం)

ఇంట్లో ఏదైనా సమస్య వస్తే.. ఇంటి పెద్దకు చెప్పుకుంటాం. గ్రామంలో ఏ సమస్య తలెత్తినా గ్రామపెద్దకు చెప్పుకుంటాం. కానీ గ్రామపెద్దకే సమస్యలు ఉంటే.. సమస్యలు సృష్టించిందే ప్రభుత్వమైతే.. వారు ఎవరితో చెప్పుకోవాలి? ప్రస్తుతం ఇటువంటి వేదననే సర్పంచ్‌లు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వెలుగు వెలిగిన సర్పంచుల నిధులు, విధులను వైసీపీ ప్రభుత్వం లాక్కొని.. వారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చేసింది. 'పంచాయతీలే అభివృద్ధికి పట్టుకొమ్మలు. సచివాలయాలు వచ్చినా పంచాయతీల ప్రాధాన్యం పోనివ్వం. పంచాయతీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం' అని సచివాలయ వ్యవస్థ ప్రారంభం నాడు సీఎం జగన్ ప్రకటించారు. కాగా.. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ వచ్చిన తర్వాత పంచాయతీల ప్రాధాన్యం నిర్వీర్యమైపోయిందని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ నిధులను సైతం వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించిందని ఆరోపిస్తున్నారు. ఎన్నికై మూడేళ్లు పూర్తయినా.. నిధులు లేక గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టలేకపోయామని పేర్కొంటున్నారు. తమ విధులకు కూడా ప్రాధాన్యం లేకుండా పోయిందని వాపోతున్నారు. వైసీపీ పాలనలో తాము మోసపోయామంటూ ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో చాలామంది సర్పంచ్‌లు కూటమి బాట పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తాము పూర్వ వైభవాన్ని సంతరించుకుంటామని భావిస్తున్నారు.

## ఆ వ్యవస్థలతో నిర్వీర్యం..

సచివాలయ, వలంటీరు సమాంతర వ్యవస్థతో గ్రామ పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. సచివాలయాలు పంచాయతీల్లో అంతర్భాగమేనని తొలుత ప్రభుత్వం ప్రకటించింది. కానీ 2021లో పంచాయతీ ఎన్నికలు జరిగిన తరవాత పరిస్థితి తారుమారైంది. సచివాలయాలపై పంచాయతీ పర్యవేక్షణను తొలగించింది. సచివాలయ ఉద్యోగుల విధులు, వారి సెలవులు వంటి పర్యవేక్షణ బాధ్యతల నుంచి పంచాయతీలను తప్పించింది. గ్రామ, వార్డు సచివాలయాల శాఖను సృష్టించి అజమాయిషీ చేస్తోంది. సచివాలయ ఉద్యోగులు సర్పంచ్‌లను ఖాతరు చేయడం లేదు. సంక్షేమ కార్యక్రమాల అమలు, పౌరసేవలు వంటి వాటి విషయంలో సర్పంచ్‌లకు కనీస సమాచారం లేదు. వలంటీర్ల వ్యవస్థపై సైతం సచివాలయాలదే పెత్తనం సాగుతోంది.



● వైసీపీ పాలనలో 50 కుటుంబాల బాధ్యతను చూసే వలంటీరుకు నెలకు గౌరవ వేతనం రూ.5 వేలు. ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచన్‌గా వస్తుంది. సెల్ ఫోన్లు, ప్రత్యేక డివైజ్‌లు, ఏడాదికోసారి సన్మానాలు, రాయితీలు వారికి అందిస్తున్నారు. పంచాయతీ ప్రథమ పౌరుడిగా ఉంటూ.. బాధ్యతలు నెరవేర్చే సర్పంచ్‌కు మాత్రం నెలకు రూ.3వేలే గౌరవ వేతనం. అదీ ఎప్పుడు వస్తుందో తెలియదు. మండల సర్వసభ్య సమావేశాలకు వెళితే సర్పంచ్‌లకు కనీసం మంచినీరు కూడా దొరకని దౌర్భాగ్య పరిస్థితి.

-జి.సిగడాం మండలం వాండ్రంగి సర్పంచ్ సాకేటి నాగరాజు ఆవేదన ఇది.



● వైసీపీతో గ్రామస్వరాజ్యం వస్తుందని భావించాను. గత ఎన్నికలకు ముందు జగన్ స్థానిక సంస్థలకు వరాలు ప్రకటించడంతో నిజమని నమ్మాను. కానీ తీరా అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక సంస్థల అధికారాలను లాక్కున్నారు. సర్పంచ్‌ను అచేతనం చేశారు. వలంటీరు, సచివాలయ వ్యవస్థతో పూర్తిగా అధికారాలకు కళ్లెం వేశారు. కనీసం స్వాతంత్ర్య దినోత్సవం నాడు జాతీయ జెండా ఎగుర వేసే హక్కును సైతం కాలరాశారు. అనవసరంగా ఈ ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌గా ఎన్నికైనందుకు బుద్ధి వచ్చింది. ఈసారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మా హక్కులు, నిధులు, విధులకు మోక్షం కలుగుతుందని ఆశిస్తున్నాను.

-లావేరు మండలం పెద్దలింగాలవలస సర్పంచ్ లుకలాపు యశోదమ్మ మనోగతం ఇది

## పదవులెందుకు?



ప్రజలు ఎంతో నమ్మకంతో మమ్మల్ని గెలిపించారు. కానీ నిధులు లేక తాగునీరు, పారిశుధ్యం, మౌలిక వసతులు కూడా కల్పించలేకపోతున్నాం. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదు. ఆర్థిక సంఘం నిధులను కూడా దారి మళ్లిస్తోంది. కనీసం మా సంతకాలు, ఆమోదం లేకుండా ఈ తతంగం పూర్తిచేసింది. ఇలా అయితే మాకు పదవులు ఎందుకు?

- భవాని, పైడిభీమవరం సర్పంచ్, రణస్థలం మండలం

## ప్రజల నుంచి నిలదీతలు



గ్రామస్థులకు ముఖం చూపించలేకపోతున్నాం. వీధుల్లో వెళుతున్నప్పుడు ప్రజలు సమస్యలపై నిలదీస్తున్నారు. వలంటీర్లకు ఉన్నంత గౌరవం కూడా మాకు లేకుండా పోతోంది. పంచాయతీల కంటే సచివాలయాల పెత్తనమే పెరిగిపోతోంది.

-హేమసుందరరావు, పెదరావుపల్లి సర్పంచ్, లావేరు మండలం

## హక్కులను కాలరాశారు



సర్పంచ్ పదవిని గుర్తుచేస్తుంటే సిగ్గేస్తోంది. ప్రజలకు ఎన్నో చేయాలని కలలుకన్నాం. కానీ ప్రభుత్వం అస్సలు సహకరించడం లేదు. మాపై సచివాలయ, వలంటీరు సమాంతర వ్యవస్థను తెచ్చి గౌరవం లేకుండా చేశారు. గతం నుంచి వస్తున్న హక్కులను కాలరాశారు. నిధుల కేటాయింపులు నిలిపివేశారు. కేంద్రం నుంచి వస్తున్న నిధులను పక్కదారి పట్టించారు.

- బాలి శ్రీనివాసరావు, వేల్పురాయి సర్పంచ్, రణస్థలం

## దారుణ వంచన



సీఎం జగన్ చెప్పినదేమిటి? చేస్తున్నదేమిటి? భారతీయుల ఆత్మ గ్రామాల్లోనే ఉందని.. గ్రామాలే అభివృద్ధికి పట్టుకొమ్మలని సచివాలయ వ్యవస్థ ప్రారంభంనాడు చెప్పుకొచ్చారు. సచివాలయాలు వచ్చినా పంచాయతీల ప్రాధాన్యత పోనివ్వనని మాటిచ్చారు. కానీ ఇప్పుడు పూర్తిగా పంచాయతీలను నిర్వీర్యం చేశారు. సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు. ఈ ఐదేళ్ల సర్పంచ్‌లు దారుణ వంచనకు గురయ్యారు.

- పిన్నింటి వెంకట భానోజీరావు, రణస్థలం సర్పంచ్

## నిధులకు కోత

గ్రామాభివృద్ధిలో కేంద్రం అందించే ఆర్థిక సంఘం నిధులు కీలకం. ఇవి రాజ్యాంగబద్ధపు నిధులు. జిల్లాలో 927 పంచాయతీలున్నాయి. జనాభా ప్రాతిపదికన నిధుల కేటాయింపు ఉంటుంది. సగటు ఒక పౌరుడికి రూ.400చొప్పున లెక్క కట్టి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. వైసీపీ సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత నిధులు పక్కదారి పట్టాయి. 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి తొలివిడతగా గత వేసవిలో నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల విద్యుత్ చార్జీల కింద ప్రభుత్వం జమ చేసుకుంది. రెండో విడత ఆర్థిక సంఘం నిధుల విడుదలలో ఎడతెగని జాప్యమవుతోంది. పంచాయతీ సాధారణ నిధులను సైతం ప్రభుత్వం విడిచిపెట్టడం లేదు. దీంతో మురుగు కాలువలను కూడా శుభ్రం చేయలేని స్థితిలో పంచాయతీ సర్పంచ్‌లు ఉన్నారు.

# రెండు రోజుల్లో.. 17,492 మంది

● పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసిన ఉద్యోగులు

**కలెక్టరేట్, మే 5:** జిల్లాలో శని, ఆదివారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ద్వారా 17,492మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. 'ఆదివారం ఒక్కరోజే 8 నియోజకవర్గాల్లో 10,488 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారు. జిల్లాలో అత్యధికంగా శ్రీకాకుళం నియోజకవర్గంలో 2059 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో అత్యల్పంగా 851 మంది ఓటు వేశారు. ఇచ్ఛాపురంలో -956, పలాసలో -934, టెక్కలిలో -1528, పాతపట్నంలో -1311, ఆమదాలవలసలో -1397. నరసన్నపేటలో 1452 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు' అని కలెక్టర్ వివరించారు.

### 7, 8 తేదీల్లో కూడా..

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి 7, 8 తేదీల్లో కూడా పోస్టల్ బ్యాలెట్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఈ నెల 4,5,6 తేదీల్లో ఓటు వినియోగించుకోలేని ఉద్యోగులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు వేయవచ్చని స్పష్టం చేశారు.

## పోస్టల్ బ్యాలెట్ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్

**నరసన్నపేట, మే 5:** సాధారణ ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఒక రోజు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఎన్నికల విధులకు నియమితులైన ఉద్యోగుల ఇళ్లకు పోస్టు ద్వారా బ్యాలెట్లను పంపించేవారు. ఈ సారి ఆ విధానం మార్చారు. దీంతో వారు ఇబ్బందులు పడకుండా వారికి ఒకరోజు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేశారు.

## నేడే హోమ్ ఓటింగ్

**కలెక్టరేట్, మే 5:** సార్వత్రిక ఎన్నికలలో భాగంగా హోమ్ ఓటింగ్ ప్రక్రియ జిల్లాలో సోమవారం జరుగనుంది. 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40శాతం దాటిన దివ్యాంగులు, కొవిడ్ బాధితులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడే ఓటర్లు ఇందుకు అర్హులు. జిల్లాలో ఈ కేటగిరీల్లో 32,938 మంది ఉన్నా.. కేవలం 495మంది మాత్రమే హోమ్ ఓటింగ్‌ను కోరారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మిగతావారు పోలింగ్ బూత్ నుంచే ఓటు వేసేందుకు మొగ్గు చూపారు. రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మిజోరాంలలో గడచిన శాసనసభ ఎన్నికల్లో హోం ఓటింగ్ విధానాన్ని విజయవంతంగా ప్రవేశపెట్టారు. నరసన్నపేటలో 68మంది, ఇచ్ఛాపురంలో 65, శ్రీకాకుళంలో 53 మంది.. ఇతర నియోజకవర్గాల్లో మరికొందరు హోమ్ ఓటింగ్ విధానంలో తొలిసారి తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు.

## ప్రశాంతంగా నీట్

**ఎచ్చెర్ల, మే 5:** వైద్య కోర్సుల్లో ప్రవేశానికి జాతీయస్థాయిలో ఆదివారం నిర్వహించిన నీట్-2024 ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం), గురజాడ (మునసబుపేట), కేంద్రీ విద్యాలయంలో ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించారు. శివానీలో మొత్తం 720 మంది విద్యార్థులకు 702 మంది హాజరుకాగా, 18మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థుల హాల్ టిక్కెట్లను పరిశీలించి కేంద్రంలోకి అనుమతించారు.

# మీరంతా ఏం చేస్తున్నారు?

- పోస్టల్ బ్యాలెట్ ఏర్పాట్లపై కలెక్టర్ కన్నెర్ర
- నరసన్నపేటలో బారులుదీరిన ఉద్యోగులు
- కూటమి, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం



నరసన్నపేటలో ఆర్వోతో మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

**నరసన్నపేట, మే 5:** నరసన్నపేటలోని జూనియర్ కళాశాలలో పోస్టల్‌బ్యాలెట్ నిర్వహణపై కలెక్టర్ కన్నెర్ర జేశారు. తొలిరోజు శనివారం పోలింగ్ ప్రక్రియ గందరగోళంగా సాగగా.. రెండోరోజు ఆదివారం కూడా అదే పరిస్థితి ఎదురైంది. నియోజకవర్గంలో 1,369 మంది ఉద్యోగ ఓటర్లకుగానూ ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 8.30గంటల నుంచే పోస్టల్‌బ్యాలెట్ కోసం ఉద్యోగులు బారులుదీరారు. టెంట్లు కూడా సక్రమంగా లేకపోవడంతో మండుటెండలో ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ అధికారులు విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో అవస్థలు పడ్డారు. పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గ బ్యాలెట్లను మూట కట్టి ఇవ్వడంతో ఏ కవర్‌లో ఏ బ్యాలెట్ పెట్టాలో తెలియక అయోమయం చెందారు. అదే సమయంలో కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల్లో ఒకే దగ్గర ఇద్దరు.. ముగ్గురు ఉండటాన్ని గుర్తించారు. సిబ్బంది మధ్య సమన్వయలోపంతో పోలింగ్ మందకొడిగా సాగుతున్నట్టు తెలుసుకున్నారు. కళాశాల రోడ్డులో రాజకీయ నేతలు టెంట్లు వేసుకుని.. జనాలు ఎక్కువగా ఉండడాన్ని గమనించారు. దీంతో ఆర్వో రామ్మోహన్‌రావు, ఎన్నికల సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరంతా ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. పోలింగ్ సక్రమంగా నిర్వహించాలని, కేంద్రాలకు సమీపంలో రాజకీయ పార్టీల శిబిరాలను తొలగించాలని ఆదేశించారు. కాగా.. నియోజకవర్గ తహసీల్దార్లు, డీటీలు చొరవ చూపకపోవడం, కొంతమంది అధికారులు ఆర్వోకు సహకరించక పోవడంతో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ గందరగోళానికి కారణమని తెలుస్తోంది. అలాగే ఇదే సమయంలో ఈవీఎం కమిషనింగ్ జరగడం.. ఎన్నికల సిబ్బంది తక్కువగా ఉండడంతో పోస్టల్ బ్యాలెట్ ఏర్పాట్లు పేలవంగా జరిగినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.



బ్యాలెట్ ఓటు కోసం బారులుదీరిన ఉద్యోగులు

### ఇరువర్గాల మధ్య వాగ్వాదం

జూనియర్ కళాశాల మైదానంలో టీడీపీ(ఉమ్మడి కూటమి), వైసీపీకి చెందిన నేతలు ఎదురెదురుగా శిబిరాలు వేశారు. అక్కడే ప్రచారం నిర్వహించగా.. పోలీసులకు ఒక వర్గంపై మరో వర్గం పరస్పర ఫిర్యాదులు చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. అదే సమయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసులు ఇరుపార్టీల శిబిరాలను తొలగించారు. దీంతో టీడీపీ, వైసీపీ నేతల మధ్య మాటామాటా పెరిగి.. ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసుల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది.



టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం

## ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం

● ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు

**కలెక్టరేట్, మే 5:** ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు ఉన్నతాధికారులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నరసన్నపేటలో శనివారం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల ప్రక్రియలో గందరగోళ పరిస్థితులకు దారితీసింది. ఈ నేపథ్యంలో నరసన్నపేట రిటర్నింగ్ అధికారి రామ్మోహనరావు, మెప్మా పీడీ, పోస్టల్ బ్యాలెట్ ఫెలిసిటేషన్ సెంటర్ ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, సారవకోట తహసీల్దారు భాగ్యలక్ష్మికి కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 24 గంటల్లోగా నోటీసులపై స్పందించి వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

# కొళాయిల్లో బురదనీరు

● ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన ప్రజలు

**హిరమండలం, మే 5:** హిరమండలం మేజర్ పంచాయతీ అంబేడ్కర్ నగర్ కాలనీవాసులు తాగునీటి సమస్య పరిష్కారం కోసం రోడ్డెక్కి ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ కాలనీ వాసులు కొన్ని రోజులుగా తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. సుమారు 45 రోజుల నుంచి రక్షితనీటి కొళాయిల ద్వారా బురద నీరు వస్తోంది. అదీ అంతంతమాత్రమే. ఆదివారం కొళాయిల నుంచి నీరు అస్సలు రాకపోవడంతో.. స్థానికులు ఖాళీ బిందెలతో ఏబీ రహదారిపై నిరసన తెలిపారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్న తరుణంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొళాయిల దగ్గర గంటల తరబడి నిరీక్షించినా బిందెడు నీరు కూడా రావడం లేదని వాపోయారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై నిరసన నేపథ్యంలో వాహనాలు నిలిచిపోయాయి. పంచాయతీ అధికారులు విషయం తెలుసుకుని.. ఉదయం 7.30 గంటల తర్వాత కుళాయిల ద్వారా నీరు విడిచిపెట్టడంతో ప్రజలు ఆందోళన విరమించారు. కాగా.. బ్యారేజీ దిగువన ఉన్న రెండు రక్షిత నీటి ఇన్‌ఫిల్టర్ బావుల్లో భూగర్భ జలాలు ఇంకిపోయాయి. దీంతో కుళాయిల ద్వారా నీటిని సక్రమంగా సరఫరా చేయ లేకపోతున్నామని ఈవో రాంబాబు, సర్పంచ్ సుందరమ్మ తెలిపారు. కొన్ని రోజులుగా బావుల నుంచి మోటారుకు నీరు అందడం లేదన్నారు. రెండు రోజుల కిందట బావులు శుభ్రం చేయించామని, అయినా నీరందలేదన్నారు. దీంతో కొళాయిల ద్వారా బురద నీరు వస్తోందని తెలిపారు. సోమవారం ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు.



హిరమండలంలో ఏబీ రహదారిపై ఖాళీ బిందెలతో ప్రజల నిరసన



కొళాయిల ద్వారా వచ్చిన బురద నీరు

# జన కేతనం

# సమర్థులకే ఓటు



- ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించినవారినే ఎన్నుకుంటాం
- సంక్షేమంతో పాటు అభివృద్ధి కావాలి
- సంపద సృష్టించి పంచిన వారికే మద్దతు
- ఇదీ తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న యువత మనోగతం

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

పాలకులు ఎవరైనా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చిన వారై ఉండాలి. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేయాలి. సంపద సృష్టించి ప్రజలకు పంచాలే తప్ప అప్పులు చేసి కాదు. ఉచితాలకు పరిమితమై అభివృద్ధిని పక్కనపెట్టడం సరికాదు. రాష్ట్రాభివృద్ధితో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పరిశ్రమల స్థాపన, మౌలికవసతుల కల్పించాలి. అలాంటి సమర్థులైన నాయకులకే ఓటేస్తామంటున్నారు తొలిసారి ఓటు హక్కు పొందిన యువత. కుటుంబ సభ్యులు, బంధువులు చెప్పారనో తమ నిర్ణయం మార్చుకోబోమని స్పష్టం చేస్తున్నారు. జిల్లాలో 26,180 మంది కొత్తగా ఓటు హక్కును పొందారు. ఈ నెల 13న జిల్లాలో లోక్‌సభ, అసెంబ్లీ సెగ్మెంట్లకు జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

### రాష్ట్ర భవిష్యత్తు ముఖ్యం



ప్రస్తుత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రం తీవ్ర ఆర్థిక లోటుతో కొట్టుమిట్టాడుతోంది. నా ఓటు విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబుకు వేస్తాను. రాజకీయాలకంటే రాష్ట్ర భవిష్యత్తు ముఖ్యం.

**-నందమూడి భాస్కరరావు, నందికొండ, సరుబుజ్జిలి మండలం**

### మంచి చేసే వారికే..



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనది. పాఠ్యాంశాల్లో ఓటుహక్కు గురించి చిన్నతనం నుంచి చదువుతుంటే ఓటుకు ఉన్న ప్రాధాన్యత ఏమిటో తెలిసేది. మంచి చేసే నాయకుడికి ఓటును తొలిసారిగా వేయాలను కుంటున్నాను. ఈ ఎన్నికల్లో ఓటు వేసి నాకు ఉన్న ప్రజాస్వామ్య నిబద్ధతను పాటిస్తాను.

**-ఎం.నరేష్, రెంటికోట, పలాస మండలం**

### దీర్ఘకాలిక ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి..



నాయకులు ప్రజలకు మంచి చేసే విధంగా ఉండాలి. ప్రాంతీయ సమస్యలను పరిష్కరించేందుకు భరోసా ఇవ్వాలి. ఎంతసేపూ సంక్షేమ పథకాలకే కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పథకాల పేరిట ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేయకూడదు. మంచి విజన్ ఉన్న నాయకులనే ఎన్నుకోవాలి. అటువంటి వారికే ఓటు వేయాలని అనుకుంటున్నాను.

**-అలియాన పవన్‌కుమార్, ఐటీఐ విద్యార్థి, రొంపివలస, పాతపట్నం మండలం**

### విజన్ ఉన్న నాయకుడికే..



నేను ఇంజనీరింగ్ పూర్తిచేశాను. విజన్ ఉన్న నాయకుడుకి మాత్రమే ఓటు వేస్తాను. ఐదేళ్లల్లో రాష్ట్రానికి ఒక్క సాఫ్ట్‌వేర్ కంపెనీ కూడా రాలేదు. ఉద్యోగ, ఉపాధి కోసం హైదరాబాద్, బెంగళూరు వెళ్లాల్సి వస్తోంది. కనీసం పరిశ్రమలను తీసు కొచ్చే ప్రయత్నం కూడా జరగలేదు. ఈ విషయంలో స్పష్టమైన హామీ, మేనిఫెస్టో ప్రకటించిన పార్టీ అభ్యర్థికి నేను ఓటు వేస్తాను. నా ఓటు ఈ రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేలా ఉండాలి.

**-మెహర్ చక్రవర్తి, నెహ్రూనగర్, పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ**

### ఉపాధి మార్గాలు చూపే వారికే ఓటు..



నేను సీఏ చదువుతున్నాను. త్వరలో ఉద్యోగం కోసం హైదరాబాద్, బెంగళూరు వెళ్లేందుకు ఆలోచిస్తున్నా. ఐదేళ్లుగా రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు వచ్చిన దాఖలాలు లేవు. కనీసం తెచ్చే ప్రయత్నం చేయలేదు. అందుకే ఈసారి రాష్ట్రానికి ఎవరైతే పరిశ్రమలు తీసుకొస్తారో.. ఎవరైతే ఉద్యోగ, ఉపాధి మార్గాలు చూపిస్తామని స్పష్టమైన హామీ ఇస్తారో.. ఇందులో కచ్చితత్వం చూపి మేనిఫెస్టోలో చూపుతారో అటువంటి పార్టీకే ఓటు వేస్తాను.

**-బదాడ కీర్తి, పొందర వీధి, పలాస కాశీబుగ్గ మునిసిపాలిటీ**

### యువతకు ఉపాధి కల్పించాలి..



**హరిపురం:** ఓటు లభించి నాలుగేళ్లయినా తొలిసారిగా వినియోగిస్తున్నా. నేటి రాజకీ యాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. యువతకు పట్టం కట్టి.. ఉపాధి అవకాశాలు కలిగించే పార్టీలకే నా ఓటు. ప్రధానంగా స్థానికంగా ప్రతి ఒక్కరికీ ఉపాధి లభించాలి. దీంతోనే సమాజ అభివృద్ధితోపాటు పరోక్షంగా వేలాదిమందికి పనిలభిస్తుంది. తాత్కాలిక పథకాల కంటే పది కాలాల పాటు యువతకు భవిష్యత్తు కలిగించేలా పార్టీలు తమ మ్యేనిఫెస్టో రూపొందించాలి. ఆదిశగా చర్యలు తీసుకుని నిరుద్యోగం లేకుండా చర్యలు తీసుకోవాలి. యువత పెడదారి పట్టకుండా సన్మార్గంలో నడిచేలా తోవ చూపించాలి.

**-పి.సాయిశిరీష, హరిపురం**

### సమస్యలపై స్పష్టత ఉండాలి..



నాయకులకు ప్రాంతీయ అభిమానం, సమస్యలపై స్పష్టత ఉండాలి. వాటిని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించే వారై ఉండాలి. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై స్పందించే వారై ఉండాలి. ప్రజలకు జవాబుదారీగా ఉండే నాయకుడికే ఈ ఎన్నికల్లో ఓటు వేస్తా.

**-పతివాడ ఆశీర్వాద్, బీటెక్ విద్యార్థి, పాతపట్నం**

### ప్రజలకు మేలు చేసే నాయకుడై ఉండాలి..



ప్రజలకు మేలు చేకూర్చే నాయకుడై ఉండాలి. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ముందుండాలి. గ్రామస్థాయిలో అభివృద్ధికి ప్రాధాన్యత అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. సంక్షేమానికి సంబంధించి వెనుకబడిన, అణగారిన వర్గాలకు తొలి అవకాశం ఇచ్చి వారిలో ఆనందం నింపాలి. అలాంటి నాయకుడికే ఓటు వేస్తాను.

**-అక్కురాడ అభిషేక్, నందిగాం**

### బాధ్యతగా భావించాలి..



ఓటు హక్కును వినియోగించుకోవడం అనేది ప్రతి ఓటరు బాధ్యతగా భావించాలి. దీనివల్ల మంచి నాయకులను ఎన్నుకునే అవకాశం ఉంటుంది. ఇది మన గెలుపుగా భావించాలి. యువత ఓటు విలువ తెలుసుకోవడంతో పాటు దానికి విస్తృత ప్రచారం కల్పించాలి. ప్రజలకు మంచి చేసే నాయకుడికే ఈ ఎన్నికల్లో ఓటు వేస్తాను.

**-కైబాడి దిలీప్, శ్రీకూర్మం**

### నిస్వార్థపరులకు ఓటు వేస్తా..



నా తొలి ఓటును నిస్వార్థపరులకే వేస్తాను. నిత్యం ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకునే నాయకుడికే ఓటు వేయాలని ఉంది. నిరుద్యోగ యువతకు ఆదుకునేందుకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలి.

**-అక్కరాడ లక్ష్మి, మెళియాపుట్టి**

### ఓటువేసేందుకు ఎదురుచూస్తున్నా..



రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు తాను ఎదురు చూస్తున్నాను. ఓటు రావడం సంతోషంగా ఉంది. బేరీజు వేసుకుని తమ నియోజకవర్గానికి మంచి చేసే వ్యక్తిని ఎన్నుకునేందుకు ఓటు ఎంతగానో ఉపయోగపడుతుంది.

**-బెందాళం కౌశిక్, పలాసపురం, సోంపేట మండలం**

### ప్రజల కోసం పనిచేసే పార్టీకే..



డిగ్రీ పూర్తిచేశాను. తొలిసారి ఓటు వేస్తున్నాను. కచ్చితంగా ప్రజల కోసం పనిచేసే పార్టీకి ఓటు వేస్తా. ఐదేళ్లుగా ఉద్యోగాల కల్పన లేకుండా పోయింది. జాబ్ క్యాలెండర్ జాడలేదు. పోనీ ప్రైవేటు పరిశ్రమలు వచ్చి ఉపాధి దొరుకుతుందంటే ఆ పరిస్థితి కూడాలేదు. ఉన్న పరిశ్రమలు కూడా మూతపడ్డాయి. చివరకు వ్యవసాయాధారిత పరిశ్రమలు సైతం మూతప డడంతో కార్మికులు, ఉద్యోగులు వీధినపడ్డారు. అందుకే పరిశ్రమలు తెస్తామన్న పార్టీకే నా ఓటు.

**-రాజాం భవాని, 30వ వార్డు రజక వీధి, పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ**

### భవిష్యత్తు కోసం ఆలోచించిన వారికే..



మొదటిసారి ఓటు వేస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. బీఎస్సీ నర్సింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్నాను. నాలాంటి వారి భవిష్యత్తుతో పాటు రాష్ట్ర భవిష్యత్తు కోసం ఆలోచించే విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబుకు మద్దతు ఇవ్వాలనుకుంటున్నాను. నాతో పాటు నా సోదరి సుప్రియ కూడా తొలిసారి ఓటు వినియోగించుకోనుంది. ఇద్దరం ఆలోచించుకుని ఓటు వేయాలనుకుంటున్నాం.

**-తమ్మినేని తేజస్విని, పూజారిపేట, 15వ వార్డు, ఆమదాలవలస మునిసిపాలిటీ**

---



# మీకు ఓటర్ స్లిప్ అందలేదా?

(నరసన్నపేట)

లోక్‌సభ, అసెంబ్లీ నియోజవర్గాలకు సాధారణ ఎన్నికల్లో భాగంగా ఈనెల 13న పోలింగ్ జరగనుంది. పోలింగ్ తేదీ దగ్గరపడుతుండడంతో ఓటర్లకు స్లిప్పులు పంపిణీ ముమ్మరంగా జరుగుతోంది. ప్రతిఇంటికి వెళ్లి ఓటరు స్లిప్పులను అందించడానికి బూత్‌లెవల్ ఆఫీసర్ల (బీఎల్వో)కు బాధ్యతలు అప్పగించారు. కానీ, చాలామందికి ఓటరు స్లిప్పులు అందడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో సంబంధిత బీఎల్వో మొబైల్ నంబర్ తెలిస్తే ఫోన్‌చేసి వారి నుంచి పొందే అవకాశముంది.

### ఏం చేయాలంటే..

ఓటరు స్లిప్పులు ఎన్నికల సిబ్బంది నుంచి అందకపోతే ఆన్‌లైన్, మొబైల్ యాప్, హెల్ప్ లైన్ నెంబర్, మొబైల్ ఎస్ఎంఎస్ ద్వారా పొందడానికి ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పించింది. ఒకవేళ ఫిజికల్ లేదా డిజిటల్ ఓటరు స్లిప్ లేకపోయినా నేరుగా పోలింగ్ బూత్‌కు వెళ్లి చెక్ చేసుకోవచ్చు. అదే పోలింగ్ కేంద్రంలో పేరు ఉంటే గుర్తింపు కార్డును చూపి ఓటు వేయవచ్చు.

### ఒక్క మెసేజ్‌తో..

ఓటరు గుర్తింపు కార్డు నెంబర్‌ను టైప్ చేసి 1950 లేదా 92117 28082 నెంబర్‌కు ఎస్ఎంఎస్ పంపితే వివరాలు వస్తాయి. ఎటువంటి రుసుం లేకుండానే ఈ నెంబరుకు పంపిన వివరాలను సరిపోల్చుకుని ఎన్నికల సంఘం తగిన సమాచారాన్ని పంపుతుంది.





### ఆన్‌లైన్‌లో అయితే..

సీఈవో.ఏపీ.ఎన్ఐసీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో సెర్చ్ యువర్ నేమ్- అసెంబ్లీ- ఓటర్స్ సర్వీస్ పోర్టల్ మెనూ ద్వారా ఓటరు గుర్తింపు కార్డు లేదా మొబైల్ నెంబర్‌లేదా పేరును ఇవ్వడం ద్వారా ఏ నెంబర్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేయవచ్చో తెలుసుకోవడంతో పాటు డిజిటల్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలాగే ఎలక్టోరల్‌సెర్చ్. ఈసీఐ. గవర్నమెంట్.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా ఇవే వివరాలను పొందుపరిచి ఓటర్ డిజిటల్ స్లిప్‌ను పొందవచ్చును.

### టోల్- ఫ్రీ నెంబర్ ద్వారా..

కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో 24 గంటలూ పనిచేసే హెల్ప్‌లైన్ (టోల్-ఫ్రీ) నెంబర్ 1950కి ఫోన్‌చేసి ఓటర్ల వివరాలను లేదా ఓటరు గుర్తింపు కార్డు నెంబర్‌ను తెలియజేయడం ద్వారా కూడా పోలింగ్ కేంద్రం, బూత్‌నెంబర్ తదితర వివరాలను పొందవచ్చు.

### మెయిల్ నుంచి..

ఎన్నికల సంఘానికి మెయిల్ (కంప్లైయింట్స్ రేటాఫ్ ఈసీఐ గవర్నమెంట్.ఇన్) ద్వారా కూడా మన గ్రీవెన్స్‌ను ఇచ్చి పోలింగ్‌బూత్ వివరాలను తిరిగి మెయిల్ ద్వారానే పొందవచ్చు.


### మొబైల్ యాప్‌తో..

ఆండ్రాయిడ్ ఫోన్ యూజర్లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి, ఐఓఎస్ వినియోగదారులు యాప్ స్టోర్ నుంచి ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ అన్న అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలను ఇవ్వాలి. దీని ద్వారా ఏ నెంబర్ పోలింగ్ బూత్‌లో ఓటు వేయవచ్చో తెలుసుకోవచ్చు.

### ఇలా కూడా పొందొచ్చు..

డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఓటర్స్. ఈసీఐ. గవర్నమెంట్. ఇన్ అనే వెబ్‌సైట్‌లో సెర్చ్ ఇన్ ఎలక్టోరల్ రోల్ అన్న ఆప్షన్‌ను సెలెక్ట్ చేసి వ్యక్తుల వివరాలను పొందుపరచడం ద్వారా కూడా తెలుసు కోవచ్చు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. సీఈవోఏపీ.ఎన్ఐసీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఆఫీసర్స్ డీటెయిల్స్ -బూత్‌లెవల్ ఆఫీసర్స్ డీటెయిల్స్ అన్న ఆప్షన్ ద్వారా జిల్లా, నియోజవర్గం, అక్కడి పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్వోల ఫోన్‌నెంబర్లను తెలుసుకుని వారికి ఫోన్‌చేసి బూత్ నెంబర్ వివరాలను పొందొచ్చు.

---





- వలస ఓటర్లకు ఫోన్‌లో సమాచారం
- నియోజక వర్గానికి కనీసం 20 బస్సులు ఏర్పాటు
- ఖర్చుకు వెనుకాడని అభ్యర్థులు

# బస్సులు పెడుతున్నాం.. బయలుదేరండి

(మెళియాపుట్టి)

సార్వత్రిక ఎన్నికలు అన్ని పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. గెలుపునకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలనూ అభ్యర్థులు వెతుకుతున్నారు. ఎన్నడూ లేనివిధంగా వలస ఓటర్లను సైతం తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికలకు మాత్రమే వలస ఓటర్లను తెప్పించేవారు. ఈసారి ఎంత ఖర్చయినా గెలుపే ప్రధానమని అభ్యర్థులు చెబుతున్నారు. అందుకే వలస ఓటర్లకు ఫోన్ చేసి ఇక్కడకు రప్పిస్తున్నారు. వారికోసం ప్రతీ నియోజకవర్గం నుంచి కనీసం 20 బస్సుల వరకూ ఏర్పాటు చేస్తున్నారు.

### వలసల జిల్లాగా..

శ్రీకాకుళం జిల్లా వాసులు దేశం నలుమూలలా ఉంటారు. ఎక్కడ ఏ సంఘటన జరిగినా అందులో జిల్లా వాసి ఉండడం విశేషం. ఉపాధి కోసం కుటుంబ సభ్యులను విడిచిపెట్టి ఎంత దూరమైనా వెళ్తుంటారు. శ్రీకాకుళం నుంచి ఎక్కువగా హైదరాబాద్, చెన్నై, ముంబై, విశాఖ, గుంటూరు, రాజమండ్రితోపాటు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్తుంటారు. వీరంతా సంక్రాంతి సమయంలో స్వస్థలాలకు వస్తుంటారు. పండగ పూర్తయిన తర్వాత ఉపాధిబాట పడతారు.

### జాబితాలు సిద్ధం..

జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఉన్న ఓటర్ల జాబితాల్లో గ్రామస్థాయిలో నాయకులకు ఆ పార్టీలు అప్పగించి వలస ఓటర్లను గుర్తించే ప్రక్రియ పూర్తిచేశాయి. వారి ఎక్కడ ఉన్నారు, ఎవరి ద్వారా వస్తారో గుర్తించి వారికి ఫోన్లు చేస్తున్నారు. బస్సులు పెడుతున్నాం, ఓటు వేయడానికి రావాలని గ్రామస్థాయి నాయకులతో సమాచారం ఇస్తున్నారు. పోలింగ్‌కు వారం రోజులే గడువు ఉందని, తక్షణమే బయలుదేరాలని కోరుతున్నారు. లోక్‌సభ, శాసనసభ అభ్య ర్థులు గెలుపు ప్రతిష్ఠాత్మకం కావడంతో రవాణా సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నాం, ఇక్కడకు వచ్చిన తర్వాత మిగాతా విషయాలు మాట్లాడుతామని ఫోన్‌లో తెలియజేస్తున్నారు. జిల్లాలో దాదాపు అన్ని నియోజకవర్గాల నుంచి వలస ఓటర్ల హైదరాబాద్‌లోనే ఎక్కువగా ఉన్నారు. దీంతో అక్కడ నుంచి బస్సుల ద్వారా తీసుకు రావాడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పార్టీల అగ్ర నాయకులు గ్రామస్థాయి నాయకులకు జాబితాలు అందజేశారు. వారు బంధువుల ద్వారా రప్పించేందుకు శ్రమిస్తున్నారు. వలస ఓటర్ల విషయంలో పార్టీ ప్రజాప్రతినిధులు జాగ్రత్తలు తీసు కుంటున్నారు. మిగతా పార్టీల నాయకులు వలస ఓటర్లను సంప్రదించకుండా చర్యలు తీసుకుంటున్నారు.

### బస్సులు రెడీ..

హైదరాబాద్ నుంచి గుంటూరు వరకు ఆర్టీసీ బస్సుకు రూ.80 వేలు, ప్రైవేటు బస్సులు రూ.1.20లక్షలు, శ్రీకాకుళం వరకు రూ.1.80 లక్షలతో బస్సులు బుక్ చేస్తున్నట్లు తెలుస్తోంది. రానుపోను రూ.3లక్షల వరకు చెల్లించి ప్రైవేటు బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఇంకా భోజనం, మద్యం సైతం ఇవ్వనున్నారు. వారు ఇక్కడికి వచ్చిన తర్వాత ఓటు డిమాండ్ బట్టి రేటు ఉంటుందని గ్రామస్థాయి నాయకులు చెబుతున్నారు. ఎక్కువగా అధికార పార్టీ అభ్యర్థులు వలస ఓటర్లపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బస్సులు కూడా సిద్ధం చేస్తున్నారు. వలస ఓటర్లు కూడా వచ్చేందుకు మొగ్గుచూపు తున్నారు. ఇక్కడి ఉన్న బంధువులను రూపాయి ఖర్చులేకుండా చూసే అవకాశం ఉండడంతో కుటుంబ సభ్యులతో సహా బయలు దేరుతున్నారు. చైన్నై వంటి దూరప్రాంతాల్లో ఉన్న వలస ఓటర్లు రైళ్లలో వచ్చేందుకు ఫోన్‌పే ద్వారా డబ్బులు వేసి తీసుకువస్తున్నారు. హైదరాబాద్‌లోని బోరబండా, జీడిమెట్ల తదితర ప్రాంతాల్లో జిల్లా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. వీరికోసం ఇప్పటికే తెలంగాణలోని పార్టీలు, అధికారులను సంప్రదించి బస్సులు బుక్ చేసుకుంటున్నట్లు స్థానికంగా ఉండే నాయకులు చెబుతున్నారు. దీనికితోడు ఈనెల 11 నుంచి 13 వరకు వరుస సెలవులు రావడంతో ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నవారు కూడా బయలు దేరుతున్నారు. నియోజకవర్గం నుంచి 20 వరకు బస్సులు సిద్ధం చేస్తుండడంతో ఖర్చు తడిసిమోపెడవుతుందని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

---

# పొలంగట్లపై నుంచి వెళ్లి ఓటు వేసేవాళ్లం



**సరుబుజ్జిలి:** 'ఇప్పటివరకు జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు పోలింగ్ కేంద్రాల్లో ఓటువేశాను. గతంలో ఆమదాలవలస వంశధార నది అవతల ప్రాంతమైన జలుమూరు మండలంలోని నగరికటకం నియోజకవర్గంలో ఉండేది. అప్పట్లో మా గ్రామానికి చెందిన ఓట్లు ప్రస్తుత ఎల్ఎన్‌పేట మండలంలోని కృష్ణాపురం, సిద్ధాంతం పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉండేవి. సుమారు ఐదు కిలోమీటర్లు పొలం గట్లు మీద నడుచుకుని వెళ్లి ఓటు వేసేవాళ్లం. నాకు ఓటు హక్కు వచ్చేసరికి కాంగ్రెస్ పార్టీలో ఉండేవాడిని. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో ఉన్నాను.'

**-కొర్ను రామ్మూర్తి(92), ఎల్‌పీఎం అగ్రహారం, సరుబుజ్జిలి మండలం**



ఆమదాలవలస: పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఉద్యోగులు



ఇచ్ఛాపురం: ఓటు హక్కు వినియోగించుకున్నామని చెబుతున్న ఉద్యోగులు



టెక్కలి: పోస్టల్‌బ్యాలెట్‌ను వినియోగించుకుంటున్న దృశ్యం

# ఉద్యోగులు బారులు

**● రెండోరోజూ భారీగా పోస్టల్ బ్యాలెట్ వినియోగం ● పరిశీలించిన కలెక్టర్**

(పలాస/ఇచ్ఛాపురం/టెక్కలి/ఆమదాలవలస/రణస్థలం/పాతపట్నం, మే 5)

సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు రెండో రోజు ఆదివారం పోస్టల్ బ్యాలెట్‌ను భారీగా వినియోగించుకున్నారు. అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది, పోలీసులు, ఉపాధ్యాయులు ఇలా పలు విభాగాలకు చెందిన ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు క్యూలో ఉండి ఓటు వేశారు. ● పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పరిశీలించారు. ఇబ్బందులు తలెత్తితే తక్షణం సమాచారం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. మొత్తం 935 మంది ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఆర్వో భరత్‌నాయక్ తెలిపారు. ● ఇచ్ఛాపురం బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌కు నాలుగు మండలాలకు చెందిన ఉద్యోగులు ఉత్సాహంగా తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇచ్ఛాపురం మండల నుంచి 242 మంది ఉద్యోగులు, కవిటి 199, కంచిలి 196, సోంపేట మండల నుంచి 318 మంది మొత్తం 955 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆర్వో సుదర్శన్ దొర చెప్పారు. ● నియోజకవర్గ కేంద్రమైన ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో 1397 ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ పూర్తిస్థాయిలో టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఉద్యోగులు ఎండలోనే గంటలకొద్దీ క్యూలైన్‌లో నిలబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ● ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎచ్చెర్ల సాయుధ పోలీసు క్వార్టర్స్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఆదివారం 851 మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొర్లె ఈశ్వరరావు, ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖరరావు పోలింగ్ సరళిని పరిశీలించారు. ● టెక్కలి నియోజకవర్గానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పోస్టల్ బ్యాలెట్‌ను ఏర్పాటు చేశారు. టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నందిగాం మండలాల పరిధిలోని ఉద్యోగులు 1,528మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ● పాతపట్నంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన బ్యాలెట్ ఓటింగ్‌లో 1311 ఓట్లు పోలైనట్లు ఈఆర్వో ఎం.అప్పారావు తెలిపారు ఈ పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎన్డీఏ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు సందర్శించారు.



పలాస: ఎన్నికల సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్



పలాస: ఓటుహక్కు వినియోగించుకోవడానికి ఆటోలో వచ్చిన అంగన్‌వాడీలు

## సిక్కోలు నుంచి 18మంది మంత్రులు

(టెక్కలి)

రాష్ట్రం ఆవిర్భావం నుంచి 2019 వరకూ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు మంత్రి వర్గంలో ప్రాధాన్యత లభించింది. తొలి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు సీఎంగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రస్తుతం సీఎం జగన్ వరకూ (1952 నుంచి 2019) జిల్లాకు చెందిన 18 మందికి మంత్రులుగా అవకాశం లభించింది. కాంగ్రెస్(ఐ), టీడీపీ, వైసీపీ ప్రభుత్వాల హయాంలో వీరు మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు.

● స్వాతంత్ర్యానికి ముందు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి వాసిరెడ్డి కృష్ణ మూర్తినాయుడు విద్యుత్ శాఖమంత్రిగా, చీకటి పరశురామనాయుడు మత్స్యశాఖ మంత్రిగా, 1920లో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో సర్ అన్నెపు పరశురాంపాత్రో విద్యుత్‌శాఖ మంత్రిగా, 1937-46 కాలంలో వీవీ గిరి కార్మికశాఖమంత్రిగా పనిచేశారు.

● ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భావం తర్వాత కృషీకార్‌లోక్ పార్టీ తరఫున 1953లో గౌతు లచ్చన్న వ్యవసాయ, కార్మికశాఖ మంత్రిగా వ్యవహరించారు.

● ఆంధ్రప్రదేశ్‌గా మారిన తర్వాత 1973లో కాంగ్రెస్ నుంచి లుకలాపు లక్ష్మణదాస్ గృహనిర్మాణ, దేవ దాయశాఖ మంత్రిగా, 1978లో కాంగ్రెస్ నుంచి గొర్లె శ్రీరాములనాయుడు చిన్ననీటి పారుదలశాఖ మంత్రిగా, 1981లో కాంగ్రెస్ నుంచి మజ్జి తులసీదాస్ వెనుకబడిన వర్గాల సంక్షేమం, మధ్యతరహా నీటిపారుదల శాఖమంత్రిగా, 1982లో కాంగ్రెస్ తరఫున సిగిలపల్లి శ్యామలరావు గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా వ్యవహరించారు.

● రాష్ట్రంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం 1983లో టీడీపీ అధికారంలోకి వచ్చింది. 1984లో టీడీపీ తరఫున తంగి సత్యనారాయణ రెవెన్యూశాఖ మంత్రిగా, 1985లో టీడీపీ తరఫున కావలి ప్రతిభాభారతి స్త్రీ శిశు సంక్షేమం, గృహనిర్మాణంశాఖ మంత్రిగా, కళా వెంకటరావు పురపాలక, విద్యుత్‌శాఖ మంత్రులుగా, గుండ అప్పల సూర్యనారాయణ సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా, 1995లో తమ్మినేని సీతారాం రాష్ట్ర న్యాయ, స్టాంపులు, స్టేషనరీ శాఖా మంత్రిగా పనిచేశారు. 1999లో టీడీపీ తరఫున గౌతు శ్యామసుందరశివాజీ బీసీ సంక్షేమం, పర్యాటకశాఖ మంత్రిగా చోటు లభించింది.

● 1989లో కాంగ్రెస్ పార్టీ తరఫున ధర్మాన ప్రసాదరావు యువజన, క్రీడాశాఖ మంత్రిగా, అలాగే మూడు పర్యాయాలు రెవెన్యూమంత్రిగా వ్యవహరించారు. 2009లో కాంగ్రెస్ పార్టీ తరుఫున శత్రుచర్ల విజయరామరాజు అటవీశాఖా మంత్రిగా, 2011లో కాంగ్రెస్ పార్టీ తరుఫున కొండ్రు మురళీమోహన్ వైద్య, ఆరోగ్య శాఖా మంత్రిగా వ్యవహరించారు. త్రిపురాన వెంకట రత్నం కూడా కొద్దిరోజులు మంత్రిగా ఈ జిల్లా నుంచి పనిచేశారు.

● రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన మొట్టమొదటి క్యాబినెట్‌లో 2014లో టీడీపీ తరుఫున కింజరాపు అచ్చెన్నాయుడు కార్మికశాఖ, వెనుకబడిన తరగతులు, క్రీడలు శాఖా మంత్రిగా పనిచేశారు. ● 2019లో వైసీపీ తరఫున ధర్మాన కృష్ణదాస్ రెవెన్యూ, రోడ్లు, భవనాలు శాఖ మంత్రిగా, 2021లో వైసీపీ తరఫున సీదిరి అప్పలరాజు పశువైద్యం, పాడిపరిశ్రమశాఖా మంత్రులుగా పనిచేశారు.

## మీ ఓటు.. మీ భవిష్యత్

**● అభ్యర్థులు కొత్త నినాదం**

నరసన్నపేట: 'మీ ఓటు .. మీ భవిష్యత్' ఇది ఓటర్లకు అధికారులు అవగాహన కార్యక్రమం కాదు. ఈసారి ఎన్నికల్లో అభ్యర్థులు కొత్త నినాదం అందుకున్నారు. గెలిస్తే అది చేస్తాం.. ఇది చేస్తాం.. అనే పాత పురాణంతో విసుగెత్తించే దాని కంటే ఓటు ప్రాధాన్యం చెప్పడం మంచిదనుకున్నారో.. ఏమో.. మేము మండుటెండల్లో సైతం మీ గ్రామానికి, మీ వీధికి వచ్చి ఓట్లు అభ్యర్థిస్తున్నాం.. అంటే మీ ఓటు ఎంత విలువైందో తెలుసుకోండి. ఓటుహక్కును వినియోగించుకోండని ఓటర్లకు పిలుపునిస్తూ.. ఈ ఎన్నికల మీకు, మీ పిల్లల భవిష్యత్‌కు గీటురాయి అంటూ ప్రచారం చేస్తున్నారు.

## అధికారమిస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తా

- ఐదు నెలల్లో శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు పూర్తిచేస్తా
- కేఆర్ స్టేడియాన్ని పునర్నిర్మిస్తా
- అన్న క్యాంటీన్‌లు కొనసాగిస్తాం
- అక్రమాలకు తావులేకుండా ఉచిత ఇసుక
- శ్రీకాకుళం టీడీపీ అభ్యర్థి గొండు శంకర్

ఇంటర్వ్యూ



(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

'తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా. నేను గెలిచిన ఐదు మాసాల్లోనే శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డును పూర్తిచేస్తా. కేఆర్ స్టేడియాన్ని పునరుద్ధరిస్తా. ఇతర పనులను కూడా చేసి చూపిస్తానని' శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ వెల్లడించారు. ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ముఖాముఖి నిర్వహించింది. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు.

**ప్రశ్న : శ్రీకాకుళం నియోజకవర్గ ప్రజలు మీకే ఎందుకు ఓటువేయాలి.?**

**జవాబు:** ఐదేళ్ల వైసీపీ పాలనలో శ్రీకాకుళం నియోజకవర్గం ఏవిధంగానూ అభివృద్ధి చెందలేదు. ఎటువంటి మేలు జరగలేదు. టీడీపీ హయాంలో జరిగిన పనులే కనిపిస్తున్నాయి. కొత్తకార్యక్రమాలేవీ చేపట్టలేదు. రోడ్లు బాగుచేయలేదు. చంద్రబాబు తలపెట్టిన టిడ్కో ఇళ్లను పంపిణీ చేయలేదు. గార, శ్రీకాకుళం, శ్రీకాకుళం రూరల్ మండలాల్లో మౌలికవసతులు కూడా అధ్వానంగా ఉన్నాయి. అవన్నీ సరిదిద్దాలంటే టీడీపీ అధికారంలోకి రావాలి. అందుకే ప్రజలు నన్ను గెలిపిస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తా.

**ప్ర: శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారిని బాగు చేస్తారా?**

**జ:** కచ్చితంగా. దీనికోసం నిర్దిష్ట ప్రణాళికతో ఉన్నాను. ఆమదాలవలసలో స్పీకర్ తమ్మినేని, శ్రీకాకుళంలో మంత్రి ధర్మాన ఉన్నా ఈ ఐదేళ్లలో రోడ్డును బాగుచేసుకోలేక పోయారు. నివేదికల ప్రకారం ఈ రహదారిపై జరిగిన ప్రమాదాల్లో 29 మంది మరణించారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఐదు మాసాల్లో శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు విస్తీర్ణ పనులను పూర్తి చేయిస్తా.

**ప్ర: సూర్యభగవానుడి ఆలయ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు?**

**జ:** దేశ వ్యాప్తంగా అరసవల్లి ఆదిత్యుని దర్శించుకునేందుకు భక్తులు వస్తుంటారు. అక్కడ ఇంద్రపుష్కరిణిని అభివృద్ధి చేస్తామని చెప్పి అందులో ఉన్న నీటిని మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశాలతో తోడించేశారు. ఇప్పుడు చుక్కనీరు కూడా లేదు. అధికారంలోకి రాగానే మాస్టర్ ప్లాన్ అమలు చేసి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం.

**ప్ర: అన్న క్యాంటీన్లను తెరిపిస్తారా?**

**జ:** కార్మికులు, పేదల కోసం టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను సైకో ప్రభుత్వం మూసివేయించింది. అయినా శ్రీకాకుళం నగరంలో పేదలు, కార్మికులకు ఆకలి తీర్చేందుకు నేనే స్వయంగా అన్న క్యాంటీన్లను రెండేళ్ల నుంచి నిర్వహించా. అధికారంలోకి వచ్చిన వెంటనే మూతపడిన క్యాంటీన్లను తెరిపిస్తాం.

**ప్ర: ఇసుక అందరికీ లభించడం లేదు. అక్రమాలను అరికడతారా?**

**జ:** వంశధార, నాగావళి నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలను ఇప్పటికే చాలాసార్లు అడ్డుకున్నాం. అధికారంలోకి వచ్చాక పూర్తిస్థాయిలో అక్రమాలు అరికడతాం. అందరికీ ఇసుక ఉచితంగా అందేలా చర్యలు చేపడతాం.

**ప్ర: కేఆర్ స్టేడియం, ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పనులపై శ్రద్ధ చూపుతారా?**

**జ:** కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణాన్ని పూర్తిచేయాలన్న ఆలోచనే ఈ ఐదేళ్లలో మంత్రి ధర్మానకు కలగలేదు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పనులను కూడా నిర్లక్ష్యంగా వదిలేశారు. నేనే ఎమ్మెల్యేగా గెలిస్తే ఈ రెండింటిని పూర్తిచేయించేలా ప్రభుత్వంపైనా ఒత్తిడి తీసుకువస్తా.

**ప్ర: అన్ని వర్గాల ప్రజలకు ఏవిధంగా మేలు చేయాలనుకుంటున్నారు?**

**జ:** ప్రత్యేకంగా నేనేమీ చెప్పనక్కర్లేదు. చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్‌గారు ఇప్పటికే అన్ని వర్గాల సంక్షేమం కోసం మేనిఫెస్టో విడుదల చేశారు. విద్యుత్ చార్జీల పెంపుదల ఉండదు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం. మహిళలకు నెలకు రూ. 1500 చొప్పున పంపిణీ. చదువుకునే పిల్లలకు రూ. 15వేలు చొప్పున సహాయం. రూ.25లక్షలు వరకు వైద్యఖర్చు. బీసీలకు యాభై ఏళ్లకే పింఛన్. ఇలా ఎన్నో పథకాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నివర్గాల ప్రజలకు పూర్తిగా న్యాయం జరుగుతుంది.

**ప్ర: శ్రీకాకుళంలో రింగురోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ విషయాల్లో పురోగతి లేదు. దీనిపై ఎలా ముందుకు వెళ్తారు?**

**జ:** నగరపాలక సంస్థకు ఎన్నికలు జరిగేలా ఉన్నత యంత్రాంగంతో చర్చిస్తా. న్యాయపరమైన చిక్కులను అధిగమించేలా చేస్తాను. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. వీటిని యుద్ధప్రాతిపదికన పూర్తిచేయిస్తా. రింగ్ రోడ్డు నిర్మాణంపై చంద్రబాబుగారే గతంలో హామీ ఇచ్చారు. అవన్నీ అమలయ్యేలా చేస్తాం.

**ప్ర: ప్రజలను ఏం కోరుతున్నారు?**

**జ:** నియోజకవర్గంలో మత్స్యకారులు వలసలు పోకుండా ఇక్కడే ఉపాధి లభించేలా జెట్టీ నిర్మాణానికి శ్రీకారం చుడతాం. యువతకు అవకాశాలు కల్పించేలా శిక్షణ కేంద్రాన్ని తీసుకువస్తాం. రౌడీయిజం లేకుండా అందరికీ మేలు జరగాలంటే ఎన్డీఏ కూటమినే గెలిపించాలి. నన్ను గెలిపిస్తే శ్రీకాకుళం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తా. ప్రజలు కూడా ఆలోచించి కూటమి అభ్యర్థులకే ఓటువేయాలి.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

**● కూటమి అభ్యర్థుల ప్రచారం**

(పొందూరు/అరసవల్లి/హరిపురం/జలుమూరు/పాతపట్నం)

రాష్ట్ర అభివృద్ధి విజనరీ లీడర్ చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని కూటమి అభ్యర్థులు పేర్కొన్నారు. ఆదివారం పొందూరు మండలం లోలుగు గ్రామంలో శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌యుడు, ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హరిపురంలోని అంబుగాంలో పలాస ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష, జలుమూరు మండలం అంధవరంలో నరసన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి, పాతపట్నం మండలం శివశంకర్‌కాలనీలో ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు, శ్రీకాకుళం నగరంలోని మంగువారితోటలో ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమకు ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.



పొందూరు: లోలుగులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కూన రవికుమార్



జలుమూరు:అంధవరంలో మాట్లాడుతున్న బగ్గు రమణమూర్తి



పాతపట్నం: శివశంకర్‌కాలనీలో ప్రచారం చేస్తున్న మామిడి గోవిందరావు



అరసవల్లి: శ్రీకాకుళం మంగువారితోటలో ప్రచారం చేస్తున్న గొండు శంకర్



హరిపురం: అంబుగాంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

## నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతాం

● ఎంపీ రామ్మోహన్, ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్

**ఆమదాలవలస:** ఆమదాలవలస నియోజకవర్గ సంపూర్ణ అభివృద్ధికి పాటుపడతామని ఉమ్మడి పార్టీ అభ్యర్థులు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్ కోరారు. ఆది వారం మండలంలోని అక్కివరం, వంజంగి, తోటాడ, కొండపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం జగన్‌రెడ్డి పాలనలో బాదుడే బాదుడు తప్ప రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ప్రజలకు ఈత కాయ ఇచ్చి గుమ్మడికాయ లాగిన చందంగా బటన్ నొక్కిన మోసపు రెడ్డి రాష్ట్రంలో మద్యం, ఇసుక, భూ దందాలు చేసి లక్ష కోట్లు అక్రమార్జన సంపాదించా డని విమర్శించారు. టీడీపీ పాలనలో నియోజక వర్గంలో కొన్ని సమస్యలు పరిష్కరించడం జరిగిందని, రానున్న ఎన్నికల్లో మమ్మల్ని అత్యధిక మెజార్టీ తో గెలిపిస్తే మరింత అభి వృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకుడు పేడాడ సూరపు నాయుడు, మెట్ట సుజాత, మెండ దాసునాయుడు, బెండి రాము, హను మంతు బాలకృష్ణ, సర్పంచ్ లక్ష్మి, ఎండ అప్పలనాయుడు, తమ్మినేని చంద్రశేఖర్, పైడి మురళీ మోహన్, ఎండ భీష్మ, తాండ్ర హరి తదితరులు పాల్గొన్నారు.



తోటవాడలో ప్రచారం చేస్తున్న ఎంపీ రామ్మోహన్, ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్

● **ఆమదాలవలస:** రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టి సర్వనాశనం చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కిందని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. ఆదివారం పట్టణంలోని 20వ వార్డు వెంగళరావు కాలనీలో ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా రవికుమార్‌ను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు రెడ్డి గౌరి, తమ్మినేని విద్యాసాగర్, రెడ్డి రాంబాబు, నాగళ్ల మురళీధర్, గురుమూర్తి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధికి చంద్రబాబును సీఎం చేయాలి: బగ్గు

**జలుమూరు:** రాష్ట్రానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు లాంటివని, ఇవి సాధించాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. అంధవరం, రామకృష్ణాపురం, పర్లాం, మాకివలస, లింగన్నాయుడుపేట, తిమడాం, సురవరం, కొమనాపల్లి, అల్లాడ, అల్లాడపేట, రామదాసుపేట తదితర గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం రావణకాష్టంగా మారిందన్నారు. వైసీపీ పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కావాలంటే రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా బగ్గు రమణమూర్తికి ప్రజలు నీరాజనం పలికారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ అధ్యక్షుడు డోల జగన్, జనసేన నాయకుడు బలగ ప్రవీణ్ కుమార్, జడ్పీటీసీ ప్రతినిధి మెండ రాంబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, మండల కన్వీనరు బగ్గు గోవిందరావు, మహిళా కార్యదర్శి గురుబెల్లి ఝాన్సీరాణి పాల్గొన్నారు.

### టీడీపీలోకి 30 కుటుంబాలు

**రామయ్యవలస(పోలాకి):** ప్రియాగ్రహారం పంచాయతీ రామయ్యవలస నుంచి ఇరగట్టపు తేజేశ్వరరావు, చింతాడ శ్యామలరావుతోపాటు 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. మాజీ ఎమ్మెల్యే కేఏఎన్ భక్త, మాజీ సర్పంచ్ లావేటి కృష్ణ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వారికి ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా రామ్మోహన్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని రమణమూర్తి కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలోకి చేరిన వారిని ఆహ్వానిస్తున్న బగ్గు రమణమూర్తి

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: ఎంపీ రామ్మోహన్

**పొందూరు:** సీఎం జగన్‌రెడ్డి అసమర్థ పాలనతో అప్పుల ఊబిలోకి కూరుకుపోయిన రాష్ట్రాన్ని మరలా గాడిలో పెట్టాలంటే టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. బి.కంచరాం, లోలుగు, రాపాక, దళ్లవలస, తోలాపి, ఖాజీపేట, అచ్చి పోల వలస గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే అభ్యర్థి కూన రవికుమార్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్ ప్రభు త్వం తీసుకువస్తున్న ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రాష్ట్రంలో తమ భూమిపై హక్కు కోల్పోయేలా ఉందని, మన భూములను మనం కాపాడు కోవాలంటే రానున్న ఎన్నికల్లో వైసీపీని పారదోలాలన్నారు. కూన రవికుమార్ మాట్లా డుతూ.. కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని, నియోజక అభివృద్ధికి పాటుపడతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు ఎ.రాము, వి.మురళి, ఎస్.శ్రీరంగనాయకులు, బలగ శంకర భాస్కర్, బిగిరి, ఖండాపు శ్రీను, లోలుగు వెంకట్, ఎంపీటీసీలు వాణి, హారిక, పి.రామప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



రాపాకలో మాట్లాడుతున్న రామ్మోహన్‌నాయుడు

### తెలగ కులస్థులను బీసీలో చేర్చాలి

**నరసన్నపేట:** జిల్లాలో తెలగ కులస్థులను బీసీల్లో చేర్పించేలా కృషి చేయాలని ఆ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ రామ్మోహన్ నాయుడును ఆదివారం కలిసి విన్నవించారు. నరసన్నపేట నియోజవర్గానికి చెందిన తెలగ యువత 'ఓసీ వద్దు.. బీసీ కావాలి' ప్లకార్డును ప్రదర్శించారు. బీసీల్లో లేకపోవడంతో ఉపాధి అవకాశాలు కోల్పోతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో నరసన్నపేట, గొట్టిపల్లి గ్రామాలకు చెందిన తెలగ కుల యువత పాల్గొన్నారు.

## రాక్షస పాలనను తరిమికొట్టండి: శిరీష

**పలాస/వజ్రపుకొత్తూరు:** రాష్ట్రంలో సాగుతున్న వైసీపీ రాక్షస పాలనను తరిమికొట్టాలని పలాస ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష కోరారు. ఆదివారం వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లికి చెందిన వైసీపీ నేతలు మోస వరప్రసాద్, మడ్డు అనిత, పొట్టి మోహనరావు, కామేశ్వరరావు, మడ్డు గోపాలకృష్ణ తదితరులు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వీరికి శిరీష కండువాలు వేసి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, రామ్మోహన్ నాయుడును ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించేలా కృషి చేయా లన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సూరాడ మోహనరావు, శశిభూషణరావు, సింగుపల్లి బాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాజీ చైర్‌పర్సన్ దంపతులకు కండువా వేస్తున్న గౌతు శిరీష

### టీడీపీలోకి కోట్ని దంపతులు

**కాశీబుగ్గ:** పలాస-కాశీబుగ్గ మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్ని లక్ష్మి, దుర్గాప్రసాద్‌లు టీడీపీలో చేరారు. పట్టణానికి రెండో చైర్‌పర్సన్‌గా లక్ష్మి వ్యవహరించారు. వైసీపీ సీనియర్ నేతలుగా ఉన్న వీరు టీడీపీ తీర్థం పుచ్చుకోగా వీరికి గౌతు శిరీష కండువాలు వేసి ఆహ్వా నించారు. వైసీపీ బలోపేతానికి తాము కృషి చేసినా తగిన గుర్తింపు లేకపోవడంతో టీడీపీలో చేరామని కోట్ని దంపతులు తెలిపారు. అనంతరం పలు వార్డుల్లో శిరీష ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు,దువ్వాడ శ్రీకాంత్, నాగరాజు, నవీన్, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

● **హరిపురం:** అంబుగాం, లోహరిబంద పంచాయతీల్లో ఆదివారం టీడీపీ ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక మహిళలు అడుగడుగునా హారతులిచ్చి కుంకుమ దిద్ది పూలమాలలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి చేతికి పని, ప్రతి చేనుకు నీరు కల్పనే తన ప్రధాన ధ్యేయమన్నారు. జీడి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన, దాసరి తాతారావు, ఎంనవీన్, తారక్, మండల లచ్చయ్య, మురళీచౌదరి, రుద్రయ్య, రట్టి లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వలస నేతలను నమ్మొద్దు: గోవిందరావు

**పాతపట్నం:** వలస నేతలను నమ్మొద్దని ఎన్డీఏ కూటమి అభ్యర్థి మామి డి గోవిందరావు అన్నారు. స్థానిక శివ శంకర్ కాలనీ, కొరసవాడల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. నియోజకవర్గ అభి వృద్ధిపై ఎమ్మెల్యే రెడ్డి శాంతి నిర్లక్ష్యం వహించారని విమర్శిం చారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, రామ్మోహన్ నాయు డును ఎంపీగా గెలిపించాలని, తద్వారా నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. వారికి గోవిందరావు కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, ఉమ్మడి పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఉమ్మడి అభ్యర్థిని గెలిపించండి

**ఎల్.ఎన్.పేట:** పాతపట్నం నియోజకవర్గంలో స్థానిక నాయకత్వాన్ని బలపరిచి తనను గెలిపిం చాలని ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. పూశాం, చొర్లంగి గ్రామాల్లో ఆదివారం పర్య టించి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. పూశాం గ్రామంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు శివ్వాల వెంకు నాయుడు, చొర్లంగిలో మాజీ సర్పంచ్ మహంతి సూర్యనారాయణలను వారి స్వగృ హాల్లో కలిసి తనకు మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం. మనోహర్ నాయుడు, కె.చిరంజీవి, నాయకులు వి.గోవిందరావు, కె.కృష్ణమా చారి, ఎస్.కిశోర్ కుమార్, కె.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.



జడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకునాయుడుతో మాట్లాడుతున్న మామిడి గోవిందరావు

### రాబోయేది టీడీపీ ప్రభుత్వమే..

**మెళియాపుట్టి:** రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని, ఉమ్మడి కూటమి ప్రభుత్వానికి మద్దతిచ్చి చంద్రబాబును సీఎంగా చేయాలని పాతపట్నం ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. ఆదివారం సుందరాడ గ్రామంలో వైసీపీ నేత శంకర్ బరోడా ఆధ్వర్యంలో 50 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరికి గోవిందరావు కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు అనపాన రాజశేఖరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేసుల నుంచి తప్పించుకునేందుకు తాకట్టు: శంకర్

**అరసవల్లి:** కేసుల నుంచి తప్పించుకునేందుకు సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ విమర్శించారు. ఆదివారం నగరంలోని 29, 30 డివిజన్లలో, మంగువారితోటలో ప్రచారంతో పాటు పట్టణంలోని పలు ప్రధాన మార్గాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు గొండు శంకర్ చిత్రంతో ఉన్న మాస్కులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తోణంగి గ్రామానికి చెందిన తోనంగి వేణు మాష్టారు, గొండు శ్రీను తదిరుల ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు, అంపోలు పంచాయతీ చల్లపేటకు చెందిన 20 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. మంగువారితోటకు చెందిన వైసీపీ నేతలు దాస్యం రాంబాబు, సోము తమ 100 మంది కార్యకర్తలతో కలిసి టీడీపీలో చేరారు. వీరికి శంకర్ కండువాలు కప్పి ఆహ్వానించారు. పట్టుశాలీ కల్యాణ మండపంలో ఆ సామాజిక వర్గ నేతలు, ఎస్ కన్వెన్షన్ హాల్‌లో బీజేపీ నాయకుడు పైడి వేణుగోపాలం ఆధ్వర్యంలో కళింగ సామాజికవర్గ నేతలతో ఆత్మీయ సమా వేశంలో శంకర్ పాల్గొన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, పరిశీలకుడు చింతల రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, వివిధ డివిజన్ల ఇన్‌చార్జిలు, ఉమ్మడి పార్టీల నేతలు పాల్గొన్నారు.

### టీడీపీ హయాంలోనే తూర్పుకాపుల అభివృద్ధి: కలమట

స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఆదివారం పాండ్రంకి శంకర్ ఆధ్వర్యంలో తూర్పుకాపు సామాజికవర్గ ఆత్మీయ కలయిక జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణ, శ్రీకాకుళం అభ్యర్థి గొండు శంకర్ హాజరయ్యారు. టీడీపీ హయాంలోనే తూర్పుకాపు సామాజిక వర్గ సంక్షేమం సాధ్యపడిందని, మరలా టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మరింత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతామన్నారు. ఎన్డీయే అభ్యర్థులు ఎంపీగా రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేగా శంకర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ నేతలు పిసిని చంద్రమోహన్, కెల్ల కొండ బాబు, పాండ్రంకి అశోక్, వాళ్ల కిరణ్, కెల్ల చిన్ని, లుకలాపు రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.



ఐక్యత ప్రదర్శిస్తున్న తూర్పుకాపు నేతలతో కలమట రమణ, గొండు శంకర్

## మనస్తాపంతో వలంటీర్ ఆత్మహత్య



సంతోష్ (ఫైల్)

**శ్రీకాకుళం క్రైం:** నగరంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో నివసిస్తున్న వలంటీర్ మనస్తాపానికి గురై ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వలంటీర్‌గా పనిచేస్తున్న టేకి సంతోష్ కుమార్ (28) ఏపీహెచ్‌బీ కాలనీలో ఎంఐజీ 91లో తల్లి కుమారి, సోదరుడు శంకర్‌లతో కలిసి నివసిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం తల్లి, సోదరుడు బయటకు వెళ్లిన సమయంలో బెడ్‌రూంలో జీఏ వైర్‌తో ఫ్యాన్ హుక్కుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బయటకు వెళ్లి తిరిగి వచ్చిన తల్లి గదిలో కుమా రుడు వేలాడుతూ కనిపించడంతో బోరున విలపిస్తూ పెద్ద కొడుకు శంకర్‌కు సమాచారం అందిం చింది. దీంతో శంకర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ గణేష్ ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఇదిలా ఉండగా మృతుడు సంతోష్ కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ఇచ్ఛాపురంలో వివాహిత..



శ్రీదేవి సుష్మల్(ఫైల్)

**ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురం పట్టణం పెద్దాకుల వీధిలో నివాసముంటున్న వివాహిత శ్రీదేవి సుష్మల్ (43) ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శ్రీదేవి సుష్మల్ బ్యూటీ పార్లర్ నడుపుతూ భర్తకు తోడుగా ఉంటూ కుటుంబ పోషణకు సహకరించేది. అయితే ఇంట్లో తరచూ చిన్న చిన్న గొడవలు జరుగుతుండేవి. ఆదివారం కూడా ఇంట్లో గొడవ పడి తీవ్ర మనస్తాపానికి గురై క్షణికావేశంలో బెడ్‌రూంకు వెళ్లి చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందింది. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు మగ పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం సీహెచ్‌సీకి తరలించారు. కుటుంబ సభ్యు ల ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ఇచ్ఛాపురం:** రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని పలాస జీఆర్‌పీ ఎస్సై షేక్ షరీఫ్ తెలిపారు. ఆదివారం ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు సమీపంలో రైలు ఢీకొట్టిందన్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. మృతుడి వయసు 60-65 మధ్య ఉంటుందన్నారు.

## రాష్ట్రానికి వైసీపీ అన్యాయం చేసింది

● సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్

**అరసవల్లి:** రాష్ట్రానికి వైసీపీ, కేంద్రంలోని బీజేపీ కార్మిక వ్యతిరేక చట్టాలతో ఆయా వర్గాలను తీరని అన్యాయం చేసిందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. రైతు, కార్మిక, ఆదివాసీ వ్యతిరేక చట్టాలు అమలుతోపాటు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించిందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీనియర్ నాయకులు సీహెచ్ నరసింగరావు, బి.కృష్ణమూర్తి, కె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బృందా కారత్

### రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతా: ఎన్ఈఆర్

**లావేరు:** లావేరు మండలంలో ఎచ్చెర్ల ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు ఆదివారం ప్రచారం చేశారు. అప్పాపురం, వెంకటాపురం, పెద లింగాలవలస, పోతాయవలస, లావేరు, జీజీవలస, లావేటిపాలేం, గురుగుబిల్లి, సుభద్రాపురం, తాళ్లవలస గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. తనకు కమలం, ఎంపీగా కలిశెట్టి అప్పలనాయుడుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ తోటయ్యదొర, టీడీపీ నాయకులు లంక నారాయణరావు, గంట్యాడ మహేష్, కొంపిల్లి లక్ష్మణరావు, నిడిగంట్ల త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

### ఓటు హక్కును వినియోగించుకోవాలి

**ఆమదాలవలస:** మాజీ సైనికులు తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించు కోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు అన్నారు. పట్టణంలోని పెద్దరెల్లి వీధిలో మాజీ సైనికుల సమాఖ్య సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎన్నికల విధుల్లో రాష్ట్రంలోని మన జిల్లా నుంచే మాజీ సైనికులు పాల్గొనడం ఆనందం గా ఉందన్నారు. బ్యాంకులు, ఇతర ఉద్యోగాల్లో స్థిరపడిన మాజీ సైనికులు తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో సభ్యులు టి.కృష్ణారావు, ఎస్.ఎల్.రావు, వి.సూర్యనారాయణ, మురళీధర రావు, రామకృష్ణ, సింహాచలం, కన్నారావు, లక్ష్మీ, జగ్గమ్మ, పద్మావతి, జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### అన్నాజీరావు ఇంటింటి ప్రచారం

**ఆమదాలవలస:** కొర్లకోట గ్రామంలో ఆమదాలవలస కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సనపల అన్నాజీరావు ఆదివారం ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేయబోయే అభివృద్ధి పనులు, సంక్షేమాన్ని వివరించారు. ఎంపీగా పేడాడ పరమేశ్వరరావు, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## జీడి రైతుల సమస్యలపై నిలదీయండి

**పలాసరూరల్:** జీడి మామిడి రైతుల సమస్య పరిష్కారానికి అన్ని రాజకీయ పార్టీలను నిలదీయాలని జనచైతన్య బృందం డిమాండ్ చేసింది. ప్రత్యేక హోదా, ప్రజా సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతు కూలీసంఘం, అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య, ప్రగతి శీలసంఘం ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లాలో ఏప్రిల్ 14న ప్రారంభమైన జన చైతన్య యాత్ర ఆదివారం పలాస, మందస మండలాలకు చేరుకుంది. 73 ఏళ్లుగా ఓటు వేసు న్నా పేదల బతుకులు మారలేదన్నారు. అధిక ధరలు, నిరుద్యోగం వంటి సమస్యలు పెరుగుతునే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి రమేష్, రాష్ట్ర నాయకులు నాగేంద్ర, వల్లూరు రాజబాబా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




### ఎండల తీవ్రత దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

**ఎచ్చెర్ల:** వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలందరూ ఇంటి వద్దే ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ వైద్యులు, లయన్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. ఆదివారం పొన్నాడ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో యువత ఎక్కువగా ఓటు హక్కును వినియోగిం చుకొని, బాధ్యత గల పౌరులుగా మసులు కోవా లని సూచించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్ క్లబ్ ప్రెసిడెంట్ పొన్నాడ రవికుమార్, గ్రామ పెద్దలు, సన్‌రైజ్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



### ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

**శ్రీకాకుళం క్రైం:** ప్రశాంత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోవడమే లక్ష్యమని రూరల్ ఎస్ఐ వాసుదేవ రావు అన్నారు. ఆదివారం కిష్టప్పపేట, సింగుపురం గ్రామాల్లో సుమారు 30 మంది పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలు, ఓటేసేందుకు వెళ్లే మార్గాలను పోలీసులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రజలు శతశాతం ఓటు హక్కును విని యోగించు కోవాల న్నారు. రౌడీషీటర్లు, అల్లర్లకు పాల్పడే వ్యక్తుల కదలికలుంటే సమాచారం ఇవ్వాలని సూచించారు.



## సైకో జగన్‌ను సాగనంపాలి: అచ్చెన్నాయుడు

**టెక్కలి:** ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు అన్ని వర్గాలను మోసం చేసిందని, రానున్న ఎన్నికల్లో సైకో జగన్‌ను సాగనంపాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం పాత నౌపడా, పెద్దరోకళ్లపల్లి, తలగాం పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రాష్ట్రాన్ని తిరిగి గాడీలో పెట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి, జనసేన ఇన్‌చార్జ్ కణితి కిరణ్‌కుమార్, హనుమంతు రామకృష్ణ, పరపటి చిన్నయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న అచ్చెన్నాయుడు

### 630 కుటుంబాలు టీడీపీలో చేరిక

**టెక్కలి/సంతబొమ్మాళి:** టెక్కలి నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి సుమారు 630 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి అచ్చెన్నాయుడు కండువాలు వేసి ఆహ్వానిం చారు. టీడీపీలో చేరిన వారిలో సంతబొమ్మాళి మండలం వడ్డితాండ్ర పంచాయతీ నుంచి కండ్ర సామాజిక వర్గానికి చెందిన 200 కుటుంబాలున్నాయి. వెంకటాపురం నుంచి 50 కుటుంబాలు, కోటబొమ్మాళి మండలం తుంబయ్యపేట నుంచి 150, పంతులుపేట నుంచి 50, టెక్కలి మండలం గూడేం, పిట్టలసరియా గ్రామాల నుంచి 100, టెక్కలి మండలం సీతాపురం నుంచి 30 కుటుంబాలు, టెక్కలి మెట్ట వీధి నుంచి 100 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కార్యక్రమంలో ఆయా మండలాల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

### ప్రజాపాలనకు పాటుపడండి: అశోక్

**కవిటి:** రాష్ట్రంలో ప్రజాపాలన ఏర్పాటుకు ప్రతీ కార్యకర్త పాటుపడాలని ఎమ్మెల్యే బెం దాళం అశోక్ కోరారు. ఆదివారం కవిటి మండలంలో ఉమ్మడి నేతలు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎ.మధు, ఇచ్ఛాపురం ఏఎంసీ మాజీ చైర్మన్ పి.దేవేంద్ర మూర్తి, వ్యాపార వేత్త పి.చందనం జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, ఎల్.రాజేష్, టీడీపీ నేతలు కృష్ణారావు, ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు. ● **సోంపేట:** వైసీపీ నాయకుడు, మత్స్యకార డైరెక్టర్ మడ్డు రాజారావుతో పాటు 100 కుటుంబాల వారు ఆదివారం టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే బెందాళం అశోక్ కండు వాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు జీకే నాయుడు, సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, మద్దిల నాగేశ్వరరావు, నిట్ట గోపాల్, బడే తమ్మారావు, బడే సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



### నేడు హోం ఓటింగ్

**టెక్కలి:** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 85 ఏళ్ల వయసు దాటి మంచానికి పరిమితమైన ఓటరు అనుమతి మేరకు సోమవారం హోం ఓటింగ్ అవకాశం ఇచ్చినట్లు టెక్కలి రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ తెలిపారు. టెక్కలి నియోజకవర్గ పరిధిలో 85 ఏళ్లు దాటిన 4,022 మంది ఓటర్లు ఉండగా వారిలో 26మంది ఓటర్లు మాత్రమే హోం ఓటింగ్‌కు అనుమతి తీసుకున్నారన్నారు. పోలింగ్ రోజున దివ్యాంగుల ఓటింగ్ కోసం వీల్‌చైర్స్ ఏర్పాటు చేశామన్నారు. ఆయనతో పాటు ఏఈఆర్‌వో బాలమురళీకృష్ణ ఉన్నారు.

### ఆదిత్యుని ఆదాయం రూ.4.85 లక్షలు

**అరసవల్లి:** అరసవల్లి సూర్యనారాయణ స్వామికి ఆదివారం రూ.4,85,373 ఆదాయం లభించింది. టిక్కెట్ల ద్వారా రూ.2,00,800, పూజలు, విరాళాల ద్వారా రూ.65,858, ప్రసాదాల ద్వారా రూ.2,18,715 లభించినట్లు ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

### ఘనంగా కార్ల్‌మార్క్స్ జయంతి

**గుజరాతీపేట:** స్థానిక యూటీఎఫ్ భవన్‌లో మిలీనియం మహనీయుడు కార్ల్‌మార్క్స్ జయంతిని ఆదివారం జేవీవీ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తన రచనల ద్వారా శ్రామిక జీవుల కష్టాలను తెలియజేసిన మహనీయుడు అని కొనియాడారు. ఆయా సంఘాల నేతలు పొందూరు అప్పారావు, బొడ్డేపల్లి మోహనరావు, గొంటి మురళీధర్, రెడ్డి మోహనరావు, సంపతిరావు కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రిమ్స్‌లో కీహోల్ సర్జరీపై అవగాహన

**అరసవల్లి:** శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్), ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆదివాకం మోకాలి శస్త్ర చికిత్సలో అత్యంత కీలకమైన 'కీహోల్' సర్జరీపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్రంలోనే మొదటి సారిగా రెండు లైవ్ సర్జరీలను లైవ్ టెలికాస్ట్ ద్వారా ప్రముఖ ఎముకల శస్త్రచికిత్స నిపుణుల సునీల్ అప్పంగి నిర్వహించి ప్రదర్శిం చారు. ఈ అవగాహనా కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 186 మంది వైద్యులు పాల్గొన్నారు. వివిధ అంశాలను సంబంధిత వైద్య నిపుణులు వివరించారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్యులు పాల్గొన్నారు.

### రేపు సీఎం జగన్ రోడ్ షో

**ఇచ్ఛాపురం:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి మంగళవారం ఇచ్ఛాపురంలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీను, ఎంపీ అభ్యర్థి పేడాడ తిలక్ ఆదివారం రాత్రి పరిశీలించారు. సురంగి రాజా మైదానంలోని హెలీప్యాడ్ వద్ద హెలీకాప్టర్ దిగి మునిసిపల్ కార్యాలయం జంక్షన్ వద్ద జగన్ బస్సులో ఉండి ప్రసంగించనున్నారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు పిరియా సాయిరాజ్, నరేష్‌కుమార్ అగర్‌వాలా పాల్గొన్నారు.